క్లుప్తంగా

రూ.23 లక్షలతో సీసీ డ్రెయిన్ల నిర్మాణం

గుడివాడ టౌన్: స్థానిక 15వ వార్డు గుడ్‌మెన్ పేట న్యూ కాలనీలో నూతనంగా నిర్మిస్తున్న సీసీ డ్రెయిన్ల నిర్మాణ పనులకు వైఎస్సార్ సీపీ జిల్లా ఉపాధ్యక్షుడు మండలి హనుమంతరావు, పట్టణ అధ్యక్షుడు గొర్ల శ్రీను భూమిపూజ చేశారు. రూ.23 లక్షల వ్యయంతో నిర్మాణ పనులు చేపడుతున్నట్లు నాయకులు తెలిపారు. పట్టణంలో మురుగునీటి సమస్య తలెత్తకుండా కోట్లాది రూపాయలు ఖర్చు చేసి నూతన డ్రెయిన్లు నిర్మిస్తున్నట్లు నాయకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ మాజీ కౌన్సిలర్ చింతల భాస్కరరావు, వార్డు ఇన్‌చార్జ్ మామిళ్ల ఎలీషా, మామిళ్ల రాజేష్, టి.ప్రశాంత్, మున్సిపల్ అధికారులు పాల్గొన్నారు.

27న 'జగనన్నకు చెబుదాం'



గుడివాడ టౌన్(నందివాడ): మండల స్థాయిలో 'జగనన్నకు చెబుదాం' కార్యక్రమం ఈనెల 27న నిర్వహిస్తున్నట్లు తహసీల్దార్ వి.భవన్నారాయణ తెలిపారు. గురువారం మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో ఎంపీడీఓ వీఎస్ నాగేశ్వరరావు, ఎంపీపీ పెయ్యల ఆదాం, జెడ్పీటీసీ కందుల దుర్గాకుమారీలతో కలిసి మండలస్థాయి అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జిల్లా కలెక్టర్ పి.రాజాబాబుతో పాటు అన్ని శాఖల జిల్లా అధికారులు పాల్గొంటారన్నారు. అధికారులు తమవద్ద పెండింగ్‌లో ఉన్న ఫిర్యాదులను క్షుణ్ణంగా పరిశీలించాలని సమస్యల పరిష్కారానికి తీసుకోవాల్సిన చర్యలపై సిద్ధంగా ఉండాలని ఆయన సూచించారు.

గుడివాడ రూరల్ సీఐ బాధ్యతల స్వీకరణ



గుడివాడరూరల్: గుడివాడరూరల్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్‌గా కొండా ఏసుబాబు గురువారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ విధులు నిర్వహిస్తున్న సీఐ కేఎన్వీ జయకుమార్ లంచం తీసుకుంటూ జూన్ నెలలో ఏసీబీ అధికారులకు పట్టుబడడంతో అప్పటి నుంచి సీఐ పోస్టు ఖాళీగా ఉంది. ఈ క్రమంలో ఏలూరు ఏసీబీలో సీఐగా విధులు నిర్వహిస్తున్న కొండా ఏసుబాబు బదిలీపై గుడివాడ తాలూకా సీఐగా నియమితులయ్యారు. ఈ సందర్భంగా సీఐ ఏసుబాబు మాట్లాడుతూ.. గుడివాడరూరల్ సర్కిల్‌లోని గుడివాడరూరల్, నందివాడ, గుడ్లవల్లేరు మండలాల్లో శాంతిభద్రతలు పరిరక్షించేందుకు కృషి చేస్తానన్నారు. ప్రజలు సహకరించాలని ఆయన కోరారు.

పీహెచ్‌సీ పరిశీలన



మండవల్లి: స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని సర్పంచ్ మెండా ఝాన్సీ గురువారం పరిశీలించారు. ఓపీ రిజిష్టర్, అటెండెన్స్ రికార్డులను తనిఖీ చేశారు. జూలై నుంచి ఇప్పటి వరకు ఆరు నార్మల్ డెలివరీలు అయ్యాయని ఆస్పత్రి సిబ్బంది ఆమెకు తెలిపారు. వైఎస్సార్ సీపీ నాయకుడు మెండా సురేష్ పాల్గొన్నారు. పీహెచ్‌సీ సిబ్బంది పాల్గొన్నారు.

విద్యార్థులకు సామగ్రి వితరణ

పమిడిముక్కల: మండలంలోని వేల్పూరు ప్రాథమిక పాఠశాలకు వనంబత్తిన కవిత రూ.2 వేల విలువైన టైలు, ఐడెంటిటీ కార్డులు, గోడ గడియారాన్ని అందజేశారు. పాఠశాలలో గురువారం జరిగిన కార్యక్రమంలో వీటిని విద్యార్థులకు అందించారు. కవితను పలువురు అభినందించారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు జి.నానిబాబు, సర్పంచ్ రత్నం దిలీప్‌కుమార్, సీఆర్పీ రవితేజ, పేరెంట్స్ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

24న జిల్లా స్థాయి వెయిట్ లిఫ్టింగ్ పోటీలు

గుడివాడటౌన్: స్థానిక ఎన్టీఆర్ స్టేడియం ఆధ్వర్యంలో ఈనెల 24వ తేదీన ఎన్టీఆర్ మెమోరియల్ ఓపెన్ వెయిట్ లిఫ్టింగ్ టోర్నమెంట్స్(పురుషులు, స్త్రీలు విభాగాల్లో) నిర్వహిస్తామని స్టేడియం కమిటీ సంయుక్త కార్యదర్శి పర్వతనేని ఆనంద్ గురువారం తెలిపారు. ఉమ్మడి కృష్ణాజిల్లాకు చెందిన క్రీడాకారులు ఈ పోటీల్లో పాల్గొనవచ్చన్నారు. క్రీడాకారులకు భోజన వసతితో పాటు సౌకర్యం కల్పిస్తామని చెప్పారు. విజేతలకు సర్టిఫికెట్‌లు, మెడల్స్ అందజేస్తామని, పూర్తి వివరాలకు 98855 04272 నంబర్‌లో సంప్రదించాలని కోరారు.

హుండీ కానుకల లెక్కింపు

రామవరప్పాడు: విజయవాడరూరల్ మండలం రామవరప్పాడు శ్రీ వెంకమ్మ పేరంటాలమ్మకు భక్తులు హుండీల ద్వారా కానుకల రూపంలో సమర్పించిన ఆదాయం రూ.6,98,373 వచ్చినట్లు ఆలయ కార్యనిర్వహణాధికారి పి.లోకేశ్వరి తెలిపారు. ఆలయ ప్రాంగణంలోని హుండీలను గురువారం శ్రీ దాస ఆంజనేయస్వామి ఆలయ కార్యనిర్వహణాధికారి ఎస్.భవాని సమక్షంలో లెక్కించారు. 3 నెలల 5 రోజులకు ఈ ఆదాయం వచ్చినట్లు పేర్కొన్నారు.

ఆశాజనకంగా ఖరీఫ్ సాగు

- ఆర్బీకేల్లో అందుబాటులో యూరియా, కాంప్లెక్స్ ఎరువులు
- 21 వేల ఎకరాల్లో వరిసాగు
- వేగవంతంగా ఈ-క్రాప్ నమోదు



మండల పరిధిలో సాగు చేస్తున్న వరి పొలం

పమిడిముక్కల: అన్నదాతలకు ప్రభుత్వం వెన్నుదన్నుగా నిలుస్తోంది. రైతు సంక్షేమమే ధ్యేయంగా చర్యలు తీసుకొంటోంది. ఖరీఫ్ సీజన్‌లో రైతులకు ఎటువంటి ఇబ్బంది కలగకుండా అన్ని సౌకర్యాలు కల్పిస్తున్నారు. దీంతో వరిసాగు ఆశాజనకంగా ఉంది. వరిసాగుకు అవసరమైన సాగునీటిని సకాలంలో విడుదల చేశారు. ఆర్బీకేల్లో యూరియా, కాంప్లెక్స్ ఎరువులు అందుబాటులో ఉంచారు. రైతు వారీగా సాగుచేస్తున్న పంటల వివరాలను ఈ- క్రాప్ యాప్‌లో నమోదు చేస్తున్నారు. ఈ- క్రాప్ పూర్తి చేసి సామాజిక తనిఖీ కోసం జాబితాలను రైతు భరోసా కేంద్రాల్లో ఉంచేలా ఏర్పాట్లు చేస్తున్నారు.

ఈ – క్రాప్ నమోదు వల్ల విత్తనాల సబ్సిడీ, పంట నష్టపరిహారం, క్రాప్ ఇన్సూరెన్స్, కొనుగోలు కేంద్రాల్లో మద్దతు ధర, సున్నా వడ్డీ, పంట రుణాలు తదితరాల్లో రైతులకు లబ్ధి చేకూరుతుంది. ఈ నెలాఖరు నాటికి ఈ-క్రాప్ నమోదు పూర్తి చేయాల్సి ఉంది. కౌలు రైతులకు సీసీఆర్సీ కార్డులు అందజేసి పథకాలన్నీ వర్తింపజేస్తున్నారు.

21 వేల ఎకరాల్లో వరిసాగు..

మండలంలో 21 వేల ఎకరాల్లో వరిసాగు చేశారు. వరి పంట ప్రస్తుతం దుబ్బు దశలో ఉంది. మెదటి విడతలో ఎకరానికి కట్ట యూరియా, కట్ట పొటాష్ కలిపి చల్లారు. రెండో విడతలో అర కట్ట యూరియా, అర కట్ట పొటాష్ కలిపి చల్లుతున్నారు. వరి దుబ్బు చేయడానికి, తెగుళ్ల రాకుండా ఉండటానికి ఉపయోగపడతాయి.

మండలంలోని 17 ఆర్బీకేలు, కొన్ని చోట్ల పీఏసీఎస్‌ల్లో కూడా యూరియా, పొటాష్, కాంప్లెక్స్ ఎరువులు అందుబాటులో ఉంచారు. మండలానికి 821 టన్నుల యూరియా, పొటాష్, కాంప్లెక్స్ వచ్చింది. ఇందులో 620 టన్నుల యూరియా ఉంది. యూరియా కొరత ఏర్పడుతుందని ప్రచారం జరగడంతో ముందస్తుగా కొనుగోలు చేసి నిల్వ చేస్తున్నారు.

కౌలురైతులకు మేలు



రైతులను ఒప్పించి కౌలుదారులకు సీసీఆర్సీ కార్డులు మంజూరు చేస్తున్నారు. ప్రభుత్వ పథకాలన్ని కౌలుదారులకు వర్తింపజేస్తున్నారు. యూరియా, పొటాష్ అడిగినంత ఇస్తున్నారు. కౌలు రైతు మేలు కోరే ప్రభుత్వం. గత నాలుగేళ్లుగా సాగు ఆశాజనకంగా ఉంటోంది.

వీరంకి వెంకటేశ్వరరావు, కౌలురైతు, అగినపర్రు

రైతు సంక్షేమ ప్రభుత్వం..



ఇది రైతు మేలు కోరే సంక్షేమ ప్రభుత్వం. వ్యవసాయానికి అధిక ప్రాధాన్యత ఇస్తూ, రైతులకు అన్ని సౌకర్యాలు కల్పిస్తున్నారు. ఆర్బీకేలు, పీఏసీఎస్‌లు అనుసంధానం చేసి రైతులకు అవసరమైన సేవలన్ని ఇక్కడే అందజేస్తున్నారు. రైతులు ఈ సేవలను సద్వినియోగం చేసుకోవాలి.

అక్కినేని సతీష్, పీఏసీఎస్ చైర్మన్, అగినపర్రు

ఎరువుల కొరత లేకుండా..



యూరియా, పొటాష్, కాంప్లెక్స్ ఎరువులు అందుబాటులో ఉంచాం. ఆర్బీకేలు, కొన్ని పీఏసీఎస్‌ల్లో కూడా ఉన్నాయి. రైతులు అడిగిన వెంటనే అందించేందుకు అన్ని చర్యలు తీసుకొంటున్నాం. ఈ క్రాప్ నమోదు వేగంగా జరుగుతుంది. పంట నమోదుకు రైతులంతా సహకరించాలి. ప్రభుత్వ పథకాలకు ఈ క్రాప్ నమోదు తప్పనిసరి.

– గణేష్‌రెడ్డి, ఏఓ, పమిడిముక్కల

క్రీడా పోటీల్లో విద్యార్థుల సత్తా



విజేతలతో హెచ్‌ఎం ఇందిరారాణి తదితరులు



మొవ్వలో ఎంపికైన విద్యార్థులతో హెచ్‌ఎం మాధవి, కోచ్

పామర్రు: పామర్రు, గుడివాడ, కైకలూరు నియోజకవర్గాల్లో పరిధిలో నిర్వహిస్తున్న క్రీడా పోటీల్లో విద్యార్థులు సత్తా చాటుతున్నారు. తమ హైస్కూల్ విద్యార్థులు జిల్లా స్థాయిలో విజేతలుగా నిలిచి రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికయ్యారని కంచర్ల రామారావు జెడ్పీ హైస్కూల్ హెచ్‌ఎం ఏ.ఇందిరారాణి తెలిపారు. స్థానిక జెడ్పీ హైస్కూల్‌లో విజేతలను గురువారం అభినందించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఈనెల 20వ తేదీన గుడివాడలోని ఎన్టీఆర్ స్టేడియంలో నిర్వహించిన జిల్లా స్థాయి బాల బాలికల (ఎస్‌జీఎఫ్) స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ వాలీబాల్ ఆటల పోటీలను నిర్వహించారన్నారు. ఈ పోటీల్లో అండర్ -14 విభాగంలో 8వ తరగతి విద్యార్థి మదీన్, అండర్ -17 విభాగంలో పదో తరగతి విద్యార్థి రుత్విక్‌లు ఉత్తమ ప్రతిభ కనబర్చారన్నారు. వీరు త్వరలో జరగబోయే రాష్ట్ర స్థాయి వాలీబాల్ పోటీలకు ఉమ్మడి కృష్ణాజిల్లాల టీమ్‌కు ప్రాతినిధ్యం వహిస్తారని తెలిపారు. ఈ సందర్భంగా విజేతలను, వీరికి శిక్షణ ఇచ్చిన ఫిజికల్ డైరెక్టర్లు రవికిషోర్, జి.మురళీలను హెచ్‌ఎం, ఉపాధ్యాయులు అభినందించారు.

జిల్లా జట్టుకు ఎంపికైన పెదముత్తేవి విద్యార్థులు

పెదముత్తేవి(మొవ్వ): గుడివాడ ఎన్టీఆర్ స్టేడియంలో బుధవారం జరిగిన జిల్లా స్థాయి స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా పోటీల్లో తమ పాఠశాల విద్యార్థులు ఉత్తమ ప్రతిభ కనబరిచి జిల్లా జట్టుకు ఎంపికయ్యారని ఎస్‌ఎల్‌ఎస్‌వీపీఎస్ ఓరియంటల్ పాఠశాల హెచ్‌ఎం కె.మాధవి తెలిపారు. వాలీబాల్ అండర్-17 బాలుర విభాగంలో గండ్రపు భరత్, అండర్-14 వాలీబాల్ బాలికల విభాగంలో చిందా హర్షిణిలు ఎంపికయ్యారన్నారు. ఎంపికైన విద్యార్థులను గురువారం పాఠశాల కరస్పాండెంట్ సీతారామ్ గురుదేవులు, గౌరకృష్ణ, పీడీ వర్మ అభినందించారు.

దాడి ఘటనపై కేసు నమోదు

కైకలూరు: పాత కక్షల నేపథ్యంలో వ్యక్తిపై జరిగిన దాడిపై కేసు నమోదు చేశామని పోలీసులు తెలిపారు. భుజబలపట్నం గ్రామానికి చెందిన దాసరి కుమార్‌రాజా(37)ను అదే గ్రామానికి చెందిన మత్తె బాలస్వామి(27) దాడి చేశారు. కుమార్‌రాజా ఫిర్యాదు మేరకు బాలస్వామిపై కేసు నమోదు చేశామన్నారు.

చిరుధాన్యాలతో ఆరోగ్యం



ముదినేపల్లిరూరల్: చిరుధాన్యాలను తీసుకోవడం ద్వారా సంపూర్ణ ఆరోగ్యంగా ఉంటామని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ కె.నాగమల్లేశ్వరి అన్నారు. ముదినేపల్లి మండలం అల్లూరు, కొరగుంటపాలెం గ్రామాల్లోని అంగన్‌వాడీ కేంద్రాల్లో పోషక మాసోత్సవాలపై అవగాహన సదస్సులు గురువారం నిర్వహించారు. చిరుధాన్యాల్లోని పోషక పదార్థాలను గుర్తించాలన్నారు. వీటిని పలు రూపాల్లో ఆహార పదార్థాలుగా తీసుకుంటూ ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని చెప్పారు. ఈ సందర్భంగా పాఠశాలల విద్యార్థులతో ర్యాలీలు నిర్వహించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్తలు సీహెచ్ భాగ్యలక్ష్మి, పి.శ్రీలక్ష్మి, పి.రంగమ్మ, పీవీఎస్ అరుణకుమారి, సీహెచ్ నాంచారమ్మ, ఎం.శ్రీదేవి, పి.నాగమణి, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

గురజాడ అప్పారావుకు నివాళి



దేశభక్తి గీతాన్ని ఆలపిస్తున్న నిర్వాహకులు, విద్యార్థులు

గుడివాడ టౌన్: పట్టణంలోని ఏజీకే మున్సిపల్ హైస్కూల్‌లో మహాకవి, హేతువాది గురజాడ అప్పారావు జయంతిని గురువారం ఘనంగా నిర్వహించారు. స్థానిక మానవతా స్వచ్ఛంద సేవా సంస్థ అధ్యక్షురాలు దండమూడి జయలక్ష్మి ఆధ్వర్యంలో స్కూలు అసెంబ్లీ సమయంలో విద్యార్థులతో దేశమును ప్రేమించుమన్నా-మంచి అన్నది పెంచుమన్నా, దేశమంటే మట్టికాదోయ్-దేశమంటే మనుషులోయ్ అనే దేశభక్తిగీతాన్ని సామూహికంగా ఆలపించారు.

గురజాడ అప్పారావు గొప్పదనాన్ని జయలక్ష్మి విద్యార్థులకు వివరించారు. విద్యార్థులకు మిఠాయిలు పంపిణీ చేశారు. మానవతా స్వచ్ఛంద సంస్థ జిల్లా చైర్మన్ పీవీ శేషగిరిరావు, వైస్ చైర్మన్ వేణుగోపాలరావు, వెంకట రమణ, అబ్దుల్ భాషా, ఇన్‌చార్జ్ హెచ్‌ఎం శ్రీలక్ష్మి, ఉపాధ్యాయులు, విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.

గృహ నిర్మాణాలు వేగవంతం చేయండి



సమీక్ష నిర్వహిస్తున్న మున్సిపల్ కమిషనర్ మురళీకృష్ణ, డీఈ రామోజీనాయక్

గుడివాడటౌన్: మల్లాయిపాలెం లే-అవుట్ జగనన్న కాలనీ లోని ఇళ్ల నిర్మాణ పనులు వేగవంతం చేయాలని మున్సిపల్ కమిషనర్ వి.మురళీకృష్ణ సూచించారు. స్థానిక మున్సిపల్ కార్యాలయంలో హౌసింగ్ డీఈ రామోజీనాయక్‌తో కలిసి సచివాలయాల కార్యదర్శులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇప్పటికే ఇళ్ల నిర్మాణంలో గుడివాడ పురపాలక సంఘం జిల్లా లోనే ముందంజలో ఉందన్నారు. మొత్తం 4578 ఇళ్ల నిర్మాణం లక్ష్యం కాగా 3057 ఇళ్లు నిర్మాణ పనులు వేగవంతంగా జరుగుతున్నాయన్నారు. 67 శాతం పైబడి పనులు పూర్తయి నిర్మాణాలు కొనసాగుతున్నాయని మిగిలిన లబ్ధిదారులను కూడా ప్రోత్సహించి నిర్మాణ పనులు డిసెంబర్ నాటికి పూర్తయ్యేలా కృషి చేయాలని ఆయన సూచించారు. పట్టణంలోని నాలుగు సచివాలయాల్లో పురోగతి వెనకంజలో ఉందన్నారు. పనులు వేగవంతం చేయకపోతే క్రమశిక్షణ చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

అనాథ శవానికి అంత్యక్రియలు



అనాథ శవాన్ని శ్మశానవాటికకు మోసుకువెళ్తున్న ఆర్కే యూత్ సభ్యులు

గుడివాడటౌన్: స్థానిక ప్రభుత్వ ఏరియా ఆస్పత్రిలో మృతి చెందిన అనాథ మృతదేహానికి గురువారం ఆర్కే యూత్ సభ్యులు అంత్యక్రియలు నిర్వహించారు. ప్రభుత్వ ఏరియా ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న నవగట్ల పాపారావు బుధవారం మృతి చెందారు. రూరల్ మండలం గుంటాకోడూరు గ్రామానికి చెందిన పాపారావు మృతిచెందినట్లు ఆస్పత్రి వర్గాలు గ్రామస్తులకు సమాచారం ఇచ్చినప్పటికీ ఎవరూ స్పందించకపోవడంతో పట్టణానికి చెందిన ఆర్కే యూత్ సభ్యులు స్పందించి అంత్యక్రియలు నిర్వహించారు. వారి సేవలను స్థానికులు అభినందించారు. కార్యక్రమంలో రామకృష్ణ(ఆర్కే), కిరణ్, శివ, చరణ్, ఆర్కే యూత్ సభ్యులు పాల్గొన్నారు.

జల్‌జీవన్ మిషన్ పనుల ప్రారంభం



చేదుర్తిపాడులో భూమిపూజ నిర్వహిస్తున్న ఎంపీపీ ఆదాం, అధికారులు, నాయకులు

గుడివాడ టౌన్(నందివాడ): నందివాడ మండలం చేదుర్తిపాడు గ్రామంలో జల్‌జీవన్ మిషన్ పనులకు ఎంపీపీ పెయ్యల ఆదాం గురువారం భూమిపూజ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ.. మండలంలోని అనేక గ్రామాల్లో చేపల చెరువులు ఉండటంతో నీటి చెరువులు కలుషితమవుతున్నాయన్నారు. ఈ నేపథ్యంలో ప్రజలకు సురక్షితమైన నీటిని సరఫరా చేసేందుకు జల్‌జీవన్ మిషన్ నిధులతో ఇంటింటికీ కుళాయి ఏర్పాటు పనులు చేపట్టామన్నారు. దీని ద్వారా ప్రజలందరికీ సురక్షితమైన నీరు సరఫరా చేస్తామని చెప్పారు. కార్యక్రమంలో సర్పంచ్ బి.వేణుగోపాల్, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ రూపేష్, పంచాయతీ కార్యదర్శి, గ్రామ ప్రముఖులు పాల్గొన్నారు.

విద్యార్థులు ఉన్నత స్థానాలకు చేరుకోవాలి

చిలకలపూడి(మచిలీపట్నం): విద్యార్థులు మంచి విద్యను అభ్యసించి ఉన్నత స్థానాలకు చేరుకోవాలని న్యాయ సేవాధికార సంస్థ జిల్లా కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి కేవీ రామకృష్ణయ్య అన్నారు. రుద్రవరం గ్రామంలోని డాక్టర్ అంబేడ్కర్ గురుకులం జూనియర్ కళాశాలలో గురువారం న్యాయవిజ్ఞాన సదస్సు నిర్వహించారు. న్యాయమూర్తి మాట్లాడుతూ విద్యార్థులు కష్టపడే తత్వం కలిగి ఉండాలన్నారు. మాజీ రాష్ట్రపతి అబ్దుల్ కలాం జీవితాన్ని ప్రతిఒక్కరు ఆదర్శంగా తీసుకుకోవాలని చెప్పారు. తాను కూడా ప్రభుత్వ పాఠశాలలోనే చదువుకున్నానని, కార్పొరేట్ పాఠశాలలకు ప్రభుత్వ పాఠశాలలు ఏమాత్రం తీసిపోవని చెప్పారు.

భక్తిశ్రద్ధలతో వినాయక చవితి వేడుకలు



దేవరపల్లిలో పూజల్లో పాల్గొన్న భక్తులు



గుడివాడలో పూజలు నిర్వహిస్తున్న భక్తులు



నారాయణపురంలో పూజలు చేస్తున్న ఎంపీపీ రామిశెట్టి, దూలం వినయ్

తోట్లవల్లూరు: పామర్రు, గుడివాడ, కైకలూరు నియోజకవర్గాల పరిధిలోని గ్రామాల్లో నాలుగో రోజైన గురువారం వినాయక చవితి వేడుకలను భక్తిశ్రద్ధలతో నిర్వహిస్తున్నారు. తోట్లవల్లూరు మండలంలోని దేవరపల్లిలో వినాయకుడి గ్రామోత్సవం గురువారం ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా జరిగిన వేలంలో తొమ్మిది కేజీల లడ్డూను రూ.50,516లకు కలకోట అనిల్‌రెడ్డి, నవతారెడ్డి దంపతులు దక్కించుకున్నారు. గతంలో ఎన్నడూ లేని విధంగా లడ్డూకు అత్యధిక ధర రావటం పట్ల భక్తులు హర్షం వ్యక్తం చేశారు. లడ్డూ దక్కించుకున్న వారిని జెడ్పీటీసీ సభ్యుడు జొన్నల రామ్మోహన్‌రెడ్డి అభినందించారు. గ్రామోత్సవం అనంతరం కేఈబీ కాలువలో గణేష్ నిమజ్జనం చేశారు.

పామర్రులో వేడుకలు

పామర్రు: స్థానిక రావి హరిగోపాల్‌నగర్‌లో ఏర్పాటు చేసిన చలువ పందిరిలోని వినాయక స్వామి వారికి ప్రత్యేక పూజలు చేశారు. రజక బజారులో వినాయక మందిరంలో స్వామి వారికి పూజలను నిర్వహించారు. తోటలో రామాలయం వద్ద ఏర్పాటు చేసిన చలువ పందిరిలో స్వామికి విశేష పూజలు చేశారు. విజయవాడ రోడ్డులోని వాసవీ కన్యకాపరమేశ్వరీ ఆలయంలో 31 అడుగుల మట్టి వినాయక స్వామికి విశేషంగా పూజలు చేశారు. మండల పరిధి జమీదగ్గుమిల్లి గ్రామంలోని వినాయక మందిరంలో శీతాల రాఘవేంద్రరావు అంజలీ దంపతులు పీటలపై కూర్చుని పూజలు చేశారు. కార్యక్రమంలో శీతాల శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు. రాపర్ల గ్రామంలోని వీరాంజనేయస్వామి దేవాలయంతో పాటు పోలవరం, ఉండ్రపూడి, అడ్డాడ, ఐనంపూడి, కొమరవోలు, కురుమద్దాలి, కనుమూరు తదితర గ్రామాల్లో వినాయక స్వామికి విశేష పూజలను నిర్వహించారు.

గుడివాడలో పూజలు

గుడివాడటౌన్: స్థానిక వైఎస్సార్ సీపీ కార్యాలయంలో ఎమ్మెల్యే కొడాలి శ్రీవెంకటేశ్వరరావు(నాని) ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న గణపతి నవరాత్రి మహోత్సవాలు గురువారం కూడా కొనసాగాయి. పట్టణానికి చెందిన రవ్వా మోహనరావు-దుర్గ, రవ్వా సందీప్-మౌనిక దంపతులు పీటలపై కూర్చుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. నాయకులు కె.ఆంజనేయ ప్రసాద్, చుండూరి శేఖర్, రమణకుమార్, మహిళా కార్యకర్తలు మూడెడ్ల ఉమ, హారిక, సురేఖ తదితరులు పాల్గొన్నారు.

రూరల్‌లో మహోత్సవాలు

గుడివాడరూరల్: మండలంలోని రామనపూడి, బిళ్లపాడు, చిన ఎరుకపాడు, తటివర్రు, మోటూరు, వలివర్తిపాడు, లింగవరం, దొండపాడు, గుంటాకోడూరు, శేరీగొల్వేపల్లి, శేరీవేల్పూరు, చౌటపల్లి తదితర గ్రామాల్లో వినాయక చవితి వేడుకల్లో భాగంగా గణనాథునికి భక్తులు విశేష పూజా కార్యక్రమాలు నిర్వహించారు. వేద పండితులు విఘ్నేశ్వరునికి ప్రత్యేక అలంకరణలు చేసి పూజా కార్యక్రమాలు శాస్త్రోక్తంగా జరిపారు. ఆయా కార్యక్రమాల్లో ఉత్సవ కమిటీ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

గణనాథుని సేవలో నాయకులు

ముదినేపల్లిరూరల్: మండలంలో వినాయక చవితి ఉత్సవాలు ఘనంగా నిర్వహిస్తున్నారు. పలు గ్రామాల్లో ఇప్పటికే ఉత్సవాలు పూర్తిచేసుకొని విగ్రహాలను నిమజ్జనం చేశారు. మరికొన్ని గ్రామాల్లో 5, 9 రోజుల పాటు ఉత్సవాలు నిర్వహిస్తున్నారు. ఊటుకూరు శివారు నారాయణపురంలో నిర్వహిస్తోన్న గణనాథుని ఉత్సవాల్లో గురువారం ఎంపీపీ రామిశెట్టి సత్యనారాయణ, వైఎస్సార్ సీపీ నియోజకవర్గ నేత దూలం ఆది వినయకుమార్ పాల్గొన్నారు. స్వామి వారికి ప్రత్యేక పూజలు చేశారు. పార్టీ నాయకులు బేతపూడి వెంకటరమణ, రాచూరి కుమార్, బత్తిన సత్యనారాయణ పాల్గొన్నారు.

మండవల్లిలో పూజలు

మండవల్లి: మండల వ్యాప్తంగా గణేశుని నవరాత్రోత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. స్థానిక శ్రీ భ్రమరాంబ సమేత మల్లేశ్వరస్వామి ఆలయం, వెలమపేట రామాలయం, స్టేషన్‌రోడ్ కోదండ రామాలయం, శ్రీ కృష్ణాలయం, హైస్కూల్ సమీపంలో ఆంజనేయస్వామి ఆలయం వద్ద, సెంటర్‌లో శ్రీ భక్తాంజనేయ స్వామివారి ఆలయం వద్ద, కానుకొల్లు, లింగాల, పెరికెగూడెం, మండవల్లి, అయ్యవారిరుద్రవరం, భైరవపట్నం, అప్పాపురం, లోకుమూడి తదితర గ్రామాల్లో వేడుకలు నిర్వహిస్తున్నారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని స్వామి వారిని దర్శించుకున్నారు.

చందన గణపతిగా స్వామివారు

గుడివాడటౌన్: స్థానిక మెయిన్‌రోడ్డులో వేం చేసి ఉన్న శ్రీ విఘ్నేశ్వరస్వామివారి దేవస్థానంలో గణపతి నవరాత్రి మహోత్సవాలను పురస్కరించుకుని స్వామివారిని చందన గణపతిగా అలంకరించి భక్తుల దర్శనానికి ఉంచారు. ఈ సందర్భంగా ఆలయ ఈఓ వీడీడీ ప్రసాద్ మాట్లాడుతూ స్వామి వారి నవరాత్రి మహోత్సవాలు అత్యంత వైభవంగా నిర్వహిస్తున్నామన్నారు. ఈనెల 25వ తేదీ ఆలయ ప్రాంగణంలో లక్ష్మి గణపతి హోమం నిర్వహిస్తున్నామని పూజలో పాల్గొనదలచిన భక్తులు రూ.516లు చెల్లించి తమ గోత్రనామాలను నమోదు చేసుకోవాలని కోరారు.

పౌష్టికాహారం సద్వినియోగం కావాలి

బంటుమిల్లి: ప్రభుత్వం గర్భిణులు, బాలింతల ఇళ్లకు అందజేస్తున్న పౌష్టికాహారం సద్వినియోగం అయ్యేలా అంగన్‌వాడీ కార్యకర్తలు పర్యవేక్షణ చేయాలని సమగ్ర స్త్రీ, శిశు సంక్షేమ (ఐసీడీఎస్) శాఖ ప్రాంతీయ (ఆర్జేడీ) సంచాలకురాలు ఉమాదేవి అన్నారు. గురువారం ఆర్యవైశ్య కల్యాణ మండపంలో ఐసీడీఎస్ బంటుమిల్లి ప్రాజెక్టు పరిధిలోని కృత్తివెన్ను, బంటుమిల్లి, పెడన మండలాలకు చెందిన అంగన్‌వాడీ కార్యకర్తలకు అవగాహన సమావేశం నిర్వహించారు. ఆర్జేడీ మాట్లాడుతూ ప్రభుత్వం అందజేస్తున్న పౌష్టికాహారం సకాలంలో గర్భిణులు, బాలింతలు వినియోగించుకునేలా కార్యకర్తల పర్యవేక్షణ ఉండాలన్నారు. సీడీపీఓ సముద్రవేణి మాట్లాడుతూ పౌష్టికాహార, తల్లిపాల వారోత్సవాలు కార్యక్రమాలు తల్లీబిడ్డల క్షేమం కోసమే నిర్వహిస్తున్నామని తెలిపారు.